క్లుప్తంగా

టీబీపై అవగాహన అవసరం



అర్తమూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం (మండపేట): టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వక్తలు అన్నారు. అర్తమూరులో బుధవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ద్వారపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. వెస్లీ మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, తీవ్రత, చికిత్స విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, వల్లూరి కాశీ విశ్వనాథం, పడాల రామకృష్ణారెడ్డి, కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులకు ఒక రోజు శిక్షణ

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఒక రోజు శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై జరిగే ఈ శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులందరూ తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భీమేశ్వరాలయంలో గణపతి హోమం



ద్రాక్షారామ దుండి గణపతి సన్నిధిలో గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన దుండి గణపతి సన్నిధిలో గణపతి నవరాత్ర మహోత్సవాలు పురస్కరించుకుని బుధవారం ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో గణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణదారుల వేద మంత్రోచ్చారణలతో హోమం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూర్మాపురానికి ఏపీపీఎస్సీ డైరెక్టర్



కూర్మాపురంలో హనుమాన్ కుటుంబ సభ్యులతో ఏపీపీఎస్సీ డైరెక్టర్ సుధాకరరెడ్డి

రాయవరం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్టర్ ఎస్.సుధాకరరెడ్డి బుధవారం కూర్మాపురం గ్రామాన్ని సందర్శించారు. జిల్లాలో పలు ప్రముఖ ఆలయాల సందర్శనలో భాగంగా అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్ ఇంటికి సతీసమేతంగా వచ్చారు. ఆయన వెంట వాటర్ రిసోర్స్ డైరెక్టర్ కొవ్వూరి త్రినాథరెడ్డి, కూర్మాపురం సొసైటీ మాజీ చైర్మన్ కందర్ప భానుమతి ఉన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి

అల్లవరం: ఒక రోజంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బంది పడినా విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోలేదని దేవగుప్తం పేదాంద్రపేట గ్రామానికి చెందిన ప్రజలు అల్లవరం సబ్ స్టేషన్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతో అమలాపురం ఏడీ, అల్లవరం సబ్ స్టేషన్ ఏఈకి ఫిర్యాదు చేసినా స్పందించదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఒక రోజు గడిచినా ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో గెద్దం ఏడుకొండలు, నేల శివాజీ, గెద్దం వెంకటరమణ, అయితాబత్తుల బాలు, కారుపల్లి రాఘవ, చోడే ఏడుకొండలు, నేల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసీ బస్సుల్లో రాయితీ

అమలాపురం రూరల్: అమలాపురం డిపో నుంచి విజయవాడ, విశాఖపట్నం వెళ్తున్న ఏసీ ఇంద్ర సర్వీసుల్లో ప్రయాణికులకు టిక్కెట్ చార్జీలో 10 నుంచి 15 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ న్‌టీవీ రాఘవకుమార్ తెలిపారు. అమలాపురం డిపో నుంచి హైదరాబాద్ నైట్ రైడర్ సర్వీసుల్లో 15 శాతం, అమలాపురం నుంచి వయా రావులపాలెం మీదుగా శంషాబాదు ఇంద్ర సర్వీసులో (సర్వీసు నెంబర్ 2562 – 2563) పది శాతం, విజయవాడ, విశాఖపట్నం రూట్లలో నడుపుతున్న ఇంద్ర ఏసీ సర్వీసుల్లో పది శాతం రాయితీ కల్పిస్తున్నామని వివరించారు. ఈ అవకాశం ఈ నెల 23వ తేదీ వరకు మాత్రమే ఉందన్నారు.

సీతాఫలం... ఎంతో ప్రియం

- సామాన్యులకు అందనంత దూరంలో ధర
- నియోజకవర్గంలో మార్కెట్‌కు ఫలాలు



రాయవరంలో సీతాఫలాల విక్రయాలు జరుపుతున్న వ్యాపారి

రాయవరం: సీతాఫలం.. ఈ పండు పేరు చెప్పగానే ఇష్టపడని వారండరు.. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఎంతో ఇష్టంగా ఆరగిస్తారు. ప్రస్తుతం సీతాఫలాలు మార్కెట్‌లోకి విరివిగా వస్తున్నాయి.. సీజన్ కావడంతో ఈ ఫలాలను కొనేందుకు అంతా ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. అయితే ధర మాత్రం ఆకాశాన్నంటడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పంట అధికంగా మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో పండుతుంది. ఇప్పటి వరకూ విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన సీతాఫలాలు ఎక్కువగా మార్కెట్‌లోకి దిగుమతి చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే మన జిల్లాకు చెందిన సీతాఫలాల పంట మార్కెట్‌కు వస్తుంది. రాజానగరం, రంగంపేట మండలాల్లో ఈ తోటలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడి నుంచి హోల్‌సేల్ మార్కెట్‌లో వంద సీతాఫలం రూ.1,500 వరకూ కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు గవరసాని, శ్రీను, లంక శ్రీను, జి.వీరబాబు పేర్కొంటున్నారు. వ్యాపారులు హోల్‌సేల్‌గా కొన్న పండ్లను గ్రేడింగ్ చేసి 25 పండ్లను రూ. 300 నుంచి రూ.800 వరకూ అమ్ముతున్నారు. మండపేట, ద్రాక్షారామ, రాయవరం, మాచవరంతోపాటు ప్రధాన రహదారుల్లో ఈ విక్రయాలు జరుపుతున్నారు. అయితే ధర అధికంగా ఉండడంతో సీతాఫలాలు కొనేందుకు సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ధరలను లెక్క చేయకుండా కొంటున్నారు.

ఆరోగ్య ప్రదాయినిగా..

సీతాఫలం అమృత తుల్యంగా చెప్పవచ్చు. గుండె జబ్బులు ఉన్నవారు సీజన్ ఉన్నంత వరకూ ఈ ఫలాలను తీసుకోవచ్చు. విటమిన్లు, లవణాలు అధికంగా ఉండడంతో పాటు కొవ్వు ఏ మాత్రం ఉండని ఒక్కో సీతాఫలంలో 200 క్యాలరీల వరకూ శక్తి లభిస్తుంది. కార్బో హైడ్రోట్లు 48, ఫైబర్ ఆరు గ్రాములు, సోడియం పది మిల్లీ గ్రాములు, విటమిన్–సి 50, కాల్షియం రెండు, ఐరన్ నాలుగు శాతం లభిస్తుంది. పేగుల్లో ఉండే హెల్మింత్స్ అనే నులి పురుగుల నివారణలో సీతాఫలం ప్రభావవంతంగా పని చేస్తుందని వైద్య పరిశోధనల్లో తేలింది. అయితే ఆస్తమా, మధుమేహం ఉన్నవారు మాత్రం సీతాఫలాలను ఆరగించకూడదు. సీతాఫలంలో ఉండే గ్లూకోజ్ కారణంగా చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎక్కువ హాని కలిగిస్తుంది.

ధర ఎక్కువగా ఉంది



సీతాఫలం అంటే ఇంటిల్లిపాదికీ ఇష్టమైన ఫలమే. ధర చూస్తేనే కష్టంగా ఉంది. పిల్లలు ఇష్టపడుతున్నా కొనేందుకు తటాపటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధర చూస్తే కొనేలా లేవు. పంట తక్కువగా ఉండడంతోనే అధిక ధరలు అని వ్యాపారులు చెబుతున్నారు. – వేమగిరి సురేష్, రాయవరం

పిల్లలు ఇష్టపడినా..



సీతాఫలం అంటే ఇష్టపడని వారు ఉండరు. సీజనల్‌గా వచ్చే పండ్లు కావడంతో పిల్లలు బాగా ఇష్టపడుతున్నారు. అయినా ధర చూస్తే గుండె అదిరిపోతుంది. ఇప్పటి వరకూ విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సీతాఫలాలు దిగుమతి చేసి వ్యాపారులు అమ్మకాలు చేశారు. ఇప్పుడిప్పుడే జిల్లా పంట అందుబాటులోకి వస్తుంది.

–షేక్ నాగూర్, రాయవరం

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

రామచంద్రపురం: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండే చిరువ్యాపారులు, తోపుడు బండ్లవర్తకులు ట్రాఫిక్‌నకు అంతరాయం కలగకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలని, ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ స్పష్టం చేశారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలపై తోపుడుబండ్ల వ్యాపారులతోనూ, వివిధ శాఖల అధికారులతో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్అండ్‌బీ మున్సిపల్ శానిటరీ తదితర అధికారులతో హాజరయ్యారు. తోపుడు బండ్ల వ్యాపారస్తులు, ఇతర వర్తక సంఘం నాయకులతో తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీ చర్చించి పలు సూచనలు చేశారు. కమిషనర్ కేవీఆర్ఆర్‌కే రాజు, సీఐ వెంకటనారాయణ, ఎస్సై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎలుకలను సామూహికంగా నియంత్రించాలి



పాలతోడులో ఎలుకల మందు తయారీని వివరిస్తున్న వ్యవసాయ సహాయకులు



వేగాయమ్మపేటలో..

కె.గంగవరం: రైతులందరూ సామూహికంగా ఎలుకల మందు వాడి వాటిని నియంత్రించాలని ఏఓ సద్గురుమూర్తి అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్కే) వద్ద బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. పేకేరులో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఓ సద్గురుమూర్తి, రామచంద్రపురం సహాయ సంచాలకుడు నాగకుమార్ పాల్గొని స్వయంగా ఎలుకల మందును తయారు చేసి రైతులకు అందించారు. వారు మాట్లాడుతూ ఎలుకలు మనుషుల కన్నా అత్యంత తెలివైన జీవులని ప్రస్తుతం వరి పొట్ట తగిలే దశలో ఉన్నందున అవి పునరుత్పత్తికి సిద్ధమయ్యే దశలో ఉన్నాయన్నారు. వాటి వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రంగు, రుచి వాసన లేని బ్రోమోడయోలిన్ మందు సూచించిన మోతాదులో ఎలుకల బొరియల వద్ద ఉంచాలన్నారు. తద్వారా ఎలుకల నియంత్రణతో మేలైన యాజమాన్యాన్ని చేపట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చలగళ్ల నాగేశ్వరరావు, వీఏఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: పంటపొలాల్లో ఎలుకల నిర్మూలనకు వ్యవసాయశాఖ సరఫరా చేస్తున్న బ్రోమోడయోలిన్ మందును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో వి.అశోక్ అన్నారు. మండలంలోని 20 ఆర్‌ఎస్కేలలో వ్యవసాయాధికారులు బుధవారం రైతులకు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. శీల, జగన్నాథగిరి, పెనుమళ్ల, తర్లంపూడి, టి.మామిడాడల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏఓ పాల్గొని మాట్లాడుతూ సామూహిక చర్యల ద్వారా రైతులు ఎలుకలను నిర్మూలించుకునేందుకు వ్యవసాయశాఖ బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేస్తుందన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో ఎలుకల నివారణ కోసం సామూహికంగా ఒకేసారి చర్యలు తీసుకోవడం ద్వారా అధిక ప్రయోజనం పొందవచ్చని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు ఎలుకల నివారణ కోసం ప్రభుత్వం అందించే బ్రోమోడయోలిన్ మందును బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎలుకల నివారణ మందును కలిపే విధానం, వాడాల్సిన మోతాదులు, విధానాలపై స్వయంగా చేస్తూ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: వ్యవసాయ క్షేత్రాల్లో సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపడితేనే ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి బలుసు రవి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలపై రైతులకు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. మండలంలోని ఆర్ఎస్‌కేల వద్ద మందును వరి నూకలతో కలిపి మిశ్రమం తయారు చేసుకునే విధానాన్ని వ్యవసాయ సహాయకులు రైతులకు వివరించారు. ఏఓ రవి మాట్లాడుతూ మండలంలో 71 కేజీల మందును పంపిణీ చేశామన్నారు. మండపేట మండలంలోని 12 గ్రామాల పరిధిల్లోని ఆర్ఎస్‌కేలలో రైతులకు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. పేకేటి పాకలు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలమూరు ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకరరావు పర్యవేక్షణలో మందు తయారీ విధానాన్ని రైతులకు వివరించారు.

వినాయక స్వామికి ప్రత్యేక పూజలు



అంగర ఆదిగణపతి మండపంలో లడ్డూను పాటదారులకు అందజేస్తున్న నిర్వాహకులు



ఏడిద శిబిరంలో పూజలు చేస్తున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద గ్రామంలోని గణపతి నవరాత్ర ఉత్సవ మండపంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు నిర్వాహకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, నాయకులు శ్రీహరి రామిశెట్టి, సంద్ర శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదానికి వేలం

అంగరలో శ్రీఆదిగణపతి నవరాత్ర ఉత్సవ మండపంలో భక్తులు గొల్లకోటి ఈశ్వరరావు, సత్యనారాయణ సమర్పించిన 101 కిలోల లడ్డూ వేలం జరిగింది. దీనిని పింజర్ల సుబ్రహ్మణ్యం, చంద్రభవాని కుమారులు పి.సందీప్, భవ్యశృతి, పి.విశ్వచైతన్య, వీరనాగతేజశ్విలు రూ.13,500కు పాడుకున్నారు. నిర్వాహకుడు పెద్దింశెట్టి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది

తగ్గిన గోదావరి ఉధృతి



పుష్కర ఘాట్‌ల వద్ద వరద తగ్గడంతో బురదమయంగా మారిన పుష్కర ఘాట్లు

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి బుధవారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టింది. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరివాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంత వరకు ఉపశమనం పొందారు. కోటిపల్లి రేవులోని ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్‌ల మధ్య వరకు ప్రస్తుతం వరద ప్రవహిస్తుంది. దీంతో పైనున్న పుష్కరఘాట్ల మెట్లు అడుగుమేర బురదమయంగా మారాయి. మత్స్యకార కాలనీలోని మూడు పేటల్లో వరదనీరు తగ్గడంతో ఇళ్లను ప్రజలు శుభ్రం చేసుకుంటున్నారు. గోదావరి ఉధృతి తగ్గినా ముక్తేశ్వరం వైపు ఉన్న రహదారి కొట్టుకుపోవడం వల్ల పంటు ప్రయాణాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేశారు. పూర్తి స్థాయిలో వరదనీరు తగ్గిన తరువాతే పంటు ప్రయాణానికి అనుమతిస్తామని వారు తెలిపారు. నిన్నటి వరకు ఉగ్రరూపం దాల్చిన గోదావరి ప్రస్తుతం ప్రశాంతంగా సముద్రంలో కలిసేందుకు ఉరకలు వేస్తుంది. మత్స్యకార కాలనీలో వరద ముప్పు వీడడంతో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడడంతో పాటు బ్లీచింగ్ చల్లడం, దోమల మందు స్ప్రే చేయడం వంటి పనులు చేశారు.

నేటి నుంచి వలీబాబా ఉత్సవాలు



కొత్తలంక బాబా దర్గా వద్ద భక్తులు

ముమ్మిడివరం: కొత్తలంకలో వలీబాబా దర్గాలో గురువారం నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీనికి దేశం నలుమూలల నుంచి వేలాది మంది హిందూ, ముస్లిం భక్తులు తరలి రానున్నారు. మౌనమే భాష, సేవే ధ్యానం, పరోపకారమే జీవిత పరమార్థంగా బాబా దివ్య సందేశాన్ని భక్తులకు అందించారు. నల్గొండ జిల్లా గొల్లేపల్లి మండలం వలికొండ గ్రామానికి చెందిన వారని, 1818లో జన్మించారని సమాధి వద్ద సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. నైజాం నవాబుల కాలంలో మూసి నదికి వచ్చిన వరదల సమయంలో బాబా కోనసీమలో ప్రముఖ శైవక్షేత్రమైన కుండలేశ్వరం వచ్చారని పూర్వీకులు చెబుతారు. అనంతరం కొత్తలంక గ్రామంలో నివాసం ఏర్పాటు చేసుకుని కొత్తలంక బాబాగా ఖ్యాతి పొందారు. నీళ్లపై నడవడం, వర్షంలో తడవక పోవడం వంటి మహిమలను అప్పటి ప్రజలు స్వయంగా చూసేవారని నానుడి. 1948 జనవరి 22న బాబా తన దేహాన్ని త్యజించారు. 1953లో బాబా సమాధిపై దర్గాను నిర్మించారు. ఇక్కడ ప్రతి ఏడాది వెంకటరత్నం వారసులు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా గురువారం గంధం పూయడం, శుక్రవారం దీపారాధన, శనివారం 'జయారత్' కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు దర్గా నిర్వాహకుడు గేదెల రఘునాథ్‌బాబా తెలిపారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్



అద్దె బకాయి ఉన్న మున్సిపల్ షాపును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి, సిబ్బంది

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో 74 షాపులతో ఉన్న అతి పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్), మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లపై మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సర్క్యులర్ బజార్‌లో రూ. 50 వేలు దాటి అద్దె బకాయిలు పడిన షాపులు 26 ఉన్నాయి. ఈ షాపులకు తాళాలు వేసేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయత్నించారు. అయితే 26 షాపులకు గాను 12 షాపుల లీజుదారులు అప్పటికప్పుడే బకాయిలు చెల్లించారు. మిగిలిన 14 షాపులకు తాళాలు వేసి సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ కూడా సర్క్యులర్ బజార్‌ను సందర్శించి అద్దె బకాయిలు ఉన్న లీజుదారులతో మాట్లాడారు. సర్క్యులర్ బజార్‌లో 12 మంది లీజుదారులు మొండి బకాయిలు చెల్లించడంతో అక్కడే రూ.4.15 లక్షలు వసూలు చేశారు. అలాగే మార్కెట్‌లో 27 షాపులతో కాంప్లెక్స్ ఉంది. ఈ షాపుల్లో రూ.50 వేలు దాటి అద్దెల బకాయిలు ఉన్న షాపులు 4 ఉన్నాయి. అధికారులు స్పెషల్ డ్రైవ్‌కు వెళ్లగానే ఈ నాలుగు షాపుల లీజుదారులు రూ.1.54 లక్షలు అద్దె బకాయిలు చెల్లించారు. స్పెషల్ డ్రైవ్‌లో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో మొత్తం రూ.5.69 లక్షల మొండి బకాయిలు వసూలైనట్లు రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. సర్క్యులర్ బజార్‌లో మరుగుదొడ్ల సౌకర్యం లేదని, పలు చోట్ల లీకులు అవుతున్నాయని, అయినా మున్సిపాలిటీ అద్దెలను ముక్కు పిండి వసూలు చేస్తోందని పలువురి లీజుదారులు కమిషనర్ నిర్మల్ కుమార్‌కు వివరించారు. త్వరలోనే సర్క్యులర్ బజారులో నెలకొన్న అసౌకర్యాలు తొలగించేందుకు పనులు చేపడతామని కమిషనర్ లీజుదారులకు చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై నియమించారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా రాయవరం మండలం లొల్ల గ్రామానికి చెందిన షేక్ వల్లీ సాహెబ్, మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా మండపేట మున్సిపల్ కౌన్సిలర్ నీలం దుర్గ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా ఏడిద గ్రామానికి చెందిన బూరిగ శ్రీనివాస్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా వెంటూరుకు చెందిన మోర్త ప్రసాద్‌బాబు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా చెల్లూరు గ్రామానికి చెందిన బొడ్డపాటి సురేష్ కుమార్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా వెదురుపాక గ్రామానికి చెందిన దండంగి కామేశ్వరి, మేధావుల ఫోరం అధ్యక్షుడిగా కర్రి అయ్యప్ప రెడ్డిలను నియమించారు.

కొత్త కార్యవర్గాల ఎన్నిక

అమలాపురం టౌన్: ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో) ఆధ్వర్యంలో అమలాపురం పోస్టల్ డివిజన్‌లో పలు యూనియన్లకు కొత్త కార్యవర్గాలు స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఆ యూనియన్ల ప్రతినిధులు పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురం డివిజన్ నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ గ్రూప్– సి కార్యదర్శిగా ఎం.ఏకాంబరం, అధ్యక్షుడిగా కె.ఆచార్యులు, నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్ట్‌మాన్ అండ్ ఎంటీఎస్ డివిజన్ కార్యదర్శిగా జి.సతీష్, అధ్యక్షునిగా బి.వెంకటరత్నం ఎన్నికయ్యారు. గ్రామీణ నేషనల్ యూనియన్ ఆఫ్ డాక్ సేవక్ డివిజన్ కార్యదర్శిగా వీవీ మహాలక్ష్మి, అధ్యక్షునిగా భీమార్జునరావు ఎన్నికయ్యారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్

కాజులూరు: దుగ్గుదుర్రులో సీసీ రోడ్డు నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) పిల్లి సుభాష్‌చంద్రబోస్ బుధవారం భూమిపూజ చేశారు. గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాల సమయంలో గ్రామంలో ఎవరైనా మరణిస్తే బురదగా ఉంటున్న రహదారి కారణంగా శవయాత్ర నిర్వహించడానికి కుటుంబ సభ్యుల కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. దీనిపై స్థానికుల కోరిక మేరకూ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఎంపీ లాండ్స్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించి బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మాతా నూకారావు, సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు రేమళ్ళ చిట్టియ్యదొర, దామెర్ల సురేష్‌బాబు, పెట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: పురపాలక పరిధిలో పలు వార్డుల్లో రూ.1.89 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం శంకుస్థాపనలు చేశారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం నిధులు వెచ్చించి విశేషంగా కృషి చేస్తుందని, తద్వారా ప్రజల ఆరోగ్యం కాపాడటంతో పాటు పట్టణాలు, గ్రామాలు మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ పేర్కొన్నారు. పట్టణంలో 20 అభివృద్ధి పనులకు గాను మంజూరైన రూ.1.89 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, పైప్ లైన్లు తదితర అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కేవీఆర్ రాజు, వైస్ చైర్మన్ శివాజీ, కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శివాజీ, ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, మున్సిపల్ డీఈ శ్రీకాంత్, ఏఈలు సునీల్, ప్రభాకర్, కూటమి పార్టీ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, అంకం శ్రీనివాస్, కడియాల రాఘవన్, కవల నానాజీ, చందమామ వాసు, మేడిశెట్టి సూర్యనారాయణ, కొమ్మన వీర్రాజు, ఫణి తేజ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన కౌలు రైతు టేకుమూడి కృష్ణ (55) పాము కాటుకు గురై మృతి చెందాడు. మంగళవారం తాను సాగు చేస్తున్న పొలంలో పనులు చేస్తుండగా గడ్డిమేటు వద్ద పాము కాటువేసింది. స్థానికులు యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ పంపన రామకృష్ణ తదితరులు పరామర్శించారు.

భూ దస్తావేజుల అందజేత



కలెక్టర్‌ను కలిసిన వలసదారుల కేంద్ర నోడల్ అధికారి మాధవి బృందం

అమలాపురం రూరల్: పెనికేరుకు చెందిన ముగ్గురు రైతుల నుంచి 1.72 ఎకరాలను నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పేరిట 2020లో సేకరించారని, ఆ భూమికి నష్ట పరిహారం అందలేదని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ ఆ లబ్ధిదారులకు వేరేచోట భూమిని సేకరించి అందించామన్నారు. దీనికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులను బుధవారం పంపిణీ చేశామన్నారు.

- విదేశాలకు వెళ్లి స్థిరపడాలనుకునే కోనసీమ ప్రాంత వలసదారుల సంక్షేమం కోసం డీఆర్‌ఓ, వలసదారుల కేంద్ర నోడల్ అధికారి కె.మాధవి నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లో ప్రొటెక్టర్ ఆఫ్ ఇమిగ్రెంట్ కేంద్ర కార్యాలయానికి అధ్యయనం కోసం వెళ్లిందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వారిని తిరిగి స్వదేశానికి రప్పించడంలో ఈ కేంద్రం కీలక భూమిక పోషించిందన్నారు. తొలుత ఆ బృందం కలెక్టర్‌ను కలసింది.
- హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు జిల్లా స్థాయిలో మారథాన్ 5 రన్‌ను ఈ నెల 9న నిర్వహిస్తామని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.